క్లుప్తంగా

ఫ్లెక్సీల తొలగింపు

కొత్తపల్లి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. శిలాఫలకాలపై ఉన్న నాయకుల ఫొటోలకు పేపర్లు అంటించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని అధికారులు స్పష్టం చేశారు.

కొండెవరంలో ఆరోగ్య సురక్ష



మహిళకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయం–2 వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 322 మందికి పరీక్షలు చేశారు. అనంతరం మందులను అందజేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థి గీతను గెలిపిస్తాం



వైఎస్సార్ సీపీలో చేరిన వర్తక సంఘ నాయకులు

పిఠాపురం: పిఠాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీతను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని పిఠాపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంఘ నాయకుడు వేణుం నారాయణరావు ఆధ్వర్యంలో పలువురు వర్తకులు వంగా గీత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు.

కోడ్ అమలుపై పర్యవేక్షణ



సామర్లకోటలో పార్టీ జెండా స్తంభానికి వేస్తున్న రంగులను పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: ఎన్నికల కోడ్‌ను అనుసరించి పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాలోను ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించి, శిలాఫలకాలకు పేపర్లు అతికించి, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నంతో గడువు ముగియడంతో ప్రత్యేక బృందం పట్టణంలో పర్యటించి పరిశీలించారు. ఈ మేరకు ఆయా పార్టీల జెండా స్తంభాలకు రంగులు వేయించారు. కాగా ఆయా ప్రదేశాల్లోని శిలాఫలకాలకు అతికిస్తున్న పేపర్లు తొలగిస్తున్నారని సచివాలయ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ రామారావుకు ఫిర్యాదులు చేశారు. ఆయా ప్రదేశాల్లో ఎన్నికలల్లో పోటీ చేస్తున్న రాజకీయ నాయకుల పోస్టర్లు ఉన్నాయని పలువురు ఎన్నికల ఫ్లైయింగ్ టీంలకు ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామారావు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 42 మంది డుమ్మా

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా హిందీ పరీక్షకు 42 మంది డుమ్మా కొట్టిన్నట్లు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాలలోను 1583 మంది రెగ్యులర్ విద్యార్థులు, 57 మంది ప్రైవేటు విద్యార్థులు హిందీ పరీక్ష రాయాల్సి ఉంది. రెగ్యులర్ 11 మంది, ప్రైవేటు విద్యార్థులు 31 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ హైస్కూల్‌లో నలుగురు, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఒకరు, అయోధ్యరామపురం మున్సిపల్ హైస్కూల్‌లో ఆరుగురు, ప్రతిభా విద్యానికేతన్‌లో ఆరుగురు, వేట్లపాలెం–ఎలో 12 మంది, వేట్లపాలెం–బిలో 9 మంది, వీకే రాయపురంలో ఇద్దరు, ఉండూరులో ఇద్దరు పరీక్షలకు డుమ్మా కొట్టారని వివరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రారంభం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ చేస్తున్న అర్చకులు

పిఠాపురం: పిఠాపురంలోని టీటీడీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఆలయ అధికారి ఎం.సందీప్ ఆధ్వర్యంలో అర్చకులు పి.రామకృష్ణమాచార్యులు, పి.నరసింహాచార్యులు వేద మంత్రోచ్ఛరణ నడుమ అంకురార్పణ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రోగి చెంతకే వైద్యం

- అంగన్‌వాడీ సెంటర్‌లో ఆరోగ్య సురక్ష శిబిరం
- తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- సత్ఫలితాలనిస్తున్న క్యాంపులు



శిబిరంలో రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్యానికి రక్షగా మారాయి. వైద్య బృందం గ్రామాల్లో పర్యటించి ప్రజలందరికీ అందుబాటులో వైద్యాన్ని తీసుకెళ్లి, అవసరమైన వారికి వైద్య సేవలందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఒక్కో రోజు ఒకొక్క గ్రామంలో వైద్యుల బృందం పర్యటించి, ఆ గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించడం ద్వారా, గ్రామంలో ప్రతిఒక్కరికీ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. వైద్య పరీక్షలు చేసి, తగిన మందులు పంపిణీ చేయడంతో పాటు, మెరుగైన వైద్యం అవసరమైన వారిని పెద్దాస్పత్రులకు తరలిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలోని 50 వార్డుల్లో, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో 51 గ్రామాల్లో ఇప్పటి వరకు 35 ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకు సుమారు 12 వేల మందికి వైద్య సేవలందించారు.

గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలందించడంతో పాటు, వారి వివరాలు నమోదు చేసి, క్రమంతప్పకుండా వైద్య సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గర్భిణులకు కేస్ షీట్ నమోదు చేసి, వైటాల్, బీపీ, ఎత్తు, బరువు చూడడంతో పాటు, హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్‌సుగర్, మలేరియా, డెంగీ వంటి అన్ని పరీక్షలూ ల్యాబ్‌లో చేస్తున్నారు. వారికి ఏ లోపం ఉన్నా, అత్యవసర చికిత్సను అందించి, సురక్షిత ప్రసవం కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు కంటి వెలుగు విభాగం ద్వారా నిష్ణాతులైన కంటి వైద్యులు కేటరాక్ట్, ఇతర నేత్ర సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని గుర్తించి, రిఫరల్ ఆస్పత్రులకు పంపి తగిన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని రకాల వైద్య సేవలకు సంబంధించి మందులు ఉచితంగా అందిస్తున్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలు

సద్వినియోగం చేసుకోవాలి

అన్ని గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. ఇందులో సాధారణ వ్యాధులు, ప్రసూతి, కంటి తదితర వాటికి సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా గర్భిణులకు ప్రసూతి వైద్య సేవలు ప్రత్యేకంగా అందిస్తున్నాం. తల్లీబిడ్డా సంరక్షణలో భాగంగా ప్రత్యేక వైద్య సేవలందించే ఏర్పాటు చేశాం. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వారిని మానిటరింగ్ చేస్తూ, వారికి తగిన వైద్య సేవలతో పాటు తగిన పోషకాహారం అందించేలా సిఫార్సు చేస్తున్నాం. వీటితో పాటు అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న చంటి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వారికి మంచి ఆరోగ్యం కల్పించడానికి క్యాంప్ నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీల పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేసి, వారిలో ఏ లోపాలున్నాయో తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా చికిత్స, పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. జనరల్ మెడిసిన్, గైనకాలజిస్టు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ తదితర వైద్య సిబ్బందితో క్యాంపులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చాం. వైద్య పరీక్షలన్నీ అధునాతన పరికరాలతో ఉచితంగా చేస్తున్నాం. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

– సునీత, ప్రభుత్వ వైద్యురాలు, గొల్లప్రోలు పీహెచ్‌సీ

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



లూథరన్ హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల వసతులపై ఆరా తీస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: డివిజన్‌లో అన్నీ పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని లూథరన్ హైస్కూల్, జేఎస్ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులు, పరీక్షా తరగతి నిర్వహణ, క్రమ శిక్షణ, మాస్ కాపీయింగ్ వంటి అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా అసౌకర్యాలు లేవన్నారు. మాస్ కాపీయింగ్ లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు నియమ, నిబంధనలు అనుసరించి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ తెలిపారు.

ఎన్నికల్లో బూత్ ఏజెంట్లే కీలకం

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి
- భారీ మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని పిలుపు



బూత్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ఎన్నికలల్లో బూత్ ఏజెంట్లే కీలకమని పెద్దాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని బూత్ ఏజెంట్లతో ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎంతో బలంగా ఉన్నదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం పక్కా అని, పెద్దాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడం ఖాయం అని తెలిపారు. అధికారంలో ఉన్న కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు బూత్ ఏజెంట్లతో ప్రతి బూత్‌లోని ఓటర్లను కలిసి ముఖ్యమంత్రి చేసిన సంక్షేమాన్ని వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఓటర్లు స్థానిక అభ్యర్థి కావాలనే కోరిక నేడు నెరవేడంతో అన్ని పార్టీల మద్దతు స్థానిక అభ్యర్థికి ఉండేలా బూత్ ఏజెంట్లు పని చేయాలని పిలుపునిచ్చారు. ఆయా బూత్ పరిధిలో ఉన్న ఓటర్ల వివరాలను తెలుసుకుని ఓట్లు లేకపోతే కొత్తగా ఓటరుగా చేర్చాలని సూచించారు. పార్టీలోకి రావడానికి అనేక మంది సిద్ధంగా ఉన్నారని ప్రతి ఒక్కరినీ ఆహ్వానించి కలుపుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. భారీ మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, అధికార పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

- చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తం కావాలి
- ఎన్నికల సిబ్బందికి ఈఆర్వో ఆదేశం



ఎన్నికల సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో రామారావు



పబ్లిసిటీ ప్రింటర్ల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్ఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే వారిపై చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల కోడ్‌పై ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియోగ్రాఫర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఆయా బృందాల అధికారులు, సిబ్బంది వారికి ఇచ్చిన సమయానికి అందుబాటులో ఉండడం లేదన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో ప్రతి బృందం తమ రోజువారీ కార్యక్రమాల నివేదికలను వీడియోలను రిజిస్టర్‌లో పొందుపర్చి సాయంత్రానికి సంబంధిత టీమ్ లీడర్‌కు అందజేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రచార వాహనాలకు ఇచ్చిన అనుమతి కాగితాన్ని వాహనానికి తప్పకుండా అంటించాలన్నారు. అనుమతులు లేని ప్రచార వాహనాలను వెంటనే సీజ్ చేయాలని, వాహనాల తనిఖీల్లో నగదు ఉంటే సంబంధిత ఆధారాలు చూపించకపోతే సొమ్మును సీజ్ చేయాలని ఆయన సూచించారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు శ్రీనివాసరెడ్డి, కేవీ పద్మావతి, జి.ఉషారాణితో పాటు ఆయా శాఖలకు చెందిన ఎన్నికల సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్రోచర్లతో అప్రమత్తం

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని పబ్లిసిటీ ప్రింటర్లు జాగ్రత్తలు పాటించాలని ఈఆర్వో జేఎస్ రామారావు సూచించారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణ పరిధిలోని పబ్లిసిటీ ప్రింటర్స్ (ఫ్లెక్సీలు, బ్రోచర్లు)తో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫ్లెక్సీలు, బ్రోచర్ల ప్రింటింగ్ విషయంలో నిర్వాహకులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్డర్ తీసుకునే ముందే అభ్యర్థి ఆధార్ కార్డు, ఎన్ని కాపీలు, ఎంత ధర అనే వివరాలు తెలిపేలా రికార్డు నిర్వహించాలన్నారు. ప్రింటర్లు ఇచ్చే ధరలు, వ్యయ ఖర్చుల నిర్వహణ అధికారులు చూపించే ధరలు సమానంగా ఉండాలన్నారు. ఏ మాత్రం ధరలు వ్యత్యాసం వచ్చిన వాటిని ముంద్రించే ప్రయత్నం చేయరాదని ఆర్ఓ హెచ్చరించారు. అనంతరం వివిధ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, బ్రోచర్ల ముద్రణ, వాటిపై తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వీరు, నాగేంద్ర, సాయి, సరోజ వాసుతో పాటు రెండు పట్టణాల ప్రింటర్లు పాల్గొన్నారు.

రోడ్లను కంపోస్టు యార్డులుగా మార్చకండి

- ఎన్నికల నోటిఫికేషన్‌తో అధికారుల ఇష్టారాజ్యం
- ఎన్నికలయ్యే వరకు కౌన్సిల్ సమావేశాలు వాయిదా



సామర్లకోట–పిఠాపురం రోడ్డు మార్జిన్‌లో చెత్త వేస్తున్న మున్సిపల్ పారిశుధ్య వాహనం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డును కంపోస్టు యార్డుగా మారుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు కౌన్సిల్ సమావేశాలు జరిగే అవకాశం లేదు. దాంతో మున్సిపల్ పాలకులకు సమాధానం చెప్పాల్సిన పని లేదని అధికారులు వారికి నచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పిఠాపురం రోడ్డు వైపు పట్టణం పెరుగుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే 614 ఇళ్ల సముదాయంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. టిడ్కో ఇళ్ల సమీపంలో పేదలందరికీ ఇళ్లు ఇవ్వడానికి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ రోడ్డులో ఇటీవల కాలంలో ప్రైవేటు లే అవుట్లు పెరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఆ రోడ్డును కంపోస్టు యార్డుగా మార్చడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను వేయడానికి ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో ఒక కంపోస్టు యార్డు ఉంది. సుమారు రూ.50 లక్షలతో క్వారీ గోతుల్లో సుమారు 15 ఏళ్ల క్రితం కంపోస్టు యార్డు కోసం భూములను కొనుగోలు చేశారు. వాటిలో చెత్తను వేయాల్సి ఉండగా పిఠాపురం రోడ్డు మార్జిన్‌లో వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అక్కడ మార్జిన్లలో పేరుకుపోయిన చెత్తను సమీపంలోని ఏలేరు కాలువలోనికి తోసేస్తున్నారని, దాంతో ఏలేరు కాలువ మూసుకుపోయి భారీ వర్షాలు వచ్చినపుడు బ్రౌన్‌పేట ముంపునకు గురవుతోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా పిఠాపురం రోడ్డులో చెత్త వేసిన వారికి మెమోలు ఇస్తామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ డీఈ, ఏఈలు

సామర్లకోట: స్థానిక ప్రత్తిపాడు రోడ్డులోని ప్రభుత్వ లే అవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం గృహ నిర్మాణ శాఖ అధికారులు పరిశీలించారు. లబ్ధిదారులు షేర్‌వాల్ టెక్నాలజీలో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంతో వాటి నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులు రూ.35 వేలు చెల్లిస్తే, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం రూ.1.8 లక్షలతో ఇల్లు నిర్మించడానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చి ఇళ్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా కాంట్రాక్టర్ సాంకేతిక కారణంతో పనులు మధ్యలో నిలిపివేశారు. ఈ మేరకు మంగళవారం నుంచి కాంట్రాక్టరు పనులు ప్రారంభించడంతో ఆ పనులను రాజకీయ నాయకులు పర్యవేక్షించే అవకాశం లేక పోవడంతో హౌసింగ్ అధికారులు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో హౌసింగ్ డీఈ వై.శ్రీనివాసు హౌసింగ్ అధికారులు, మెప్మా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రూ.35 వేలు చెల్లించిన ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు శ్రీనివాసు, సురేష్‌కుమార్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ స్వామి కల్యాణం



మూలపేటలో ఉన్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి



సత్యనారాయణస్వామి

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన, సాయంత్రం గరుడ, గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, ఎదురు సన్నాహం, స్వామివారి దివ్య కల్యాణం, గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, బుర్రకథ, శుక్రవారం సదస్యం, కోలాటం, ప్రత్యేక పూజలు, 24న స్వామివారి రథోత్సవం, 25న చక్రస్నానం, గ్రామోత్సవం, 26న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. స్వామివారికి పూల మాల వేసి, మొక్కుకుంటే.. వివాహం కాని వారికి వెంటనే పెళ్లవుతుందని, సంతానం లేనివారికి పిల్లలు పుడతారని భక్తుల అపార నమ్మకం. అందుకే పెళ్లికాని వారు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిస్తుంటారు. పిల్లలు పుట్టని వారు స్వామివారికి మొక్కుకుని, సంతానం కలిగాక తులాభారం సమర్పిస్తారు.

సమస్యల పరిష్కారానికి రామతత్వమే రాజమార్గం



అన్నదానం చిదంబర శాస్త్రిని సత్కరిస్తున్న వాత్సల్య భారతి సభ్యులు

బోట్‌క్లబ్: సమాజం ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిష్కారానికి రామ తత్వాన్ని అవగాహన చేసుకోవడమే రాజమార్గమని ప్రముఖ సాహితీవేత్త అన్నదానం చిదంబర శాస్త్రి అన్నారు. భారతమాత తత్వ ప్రచార వేదిక, వాత్సల్య భారతి ఆధ్వర్యంలో విద్యుత్‌నగర్‌లో ఒక ఫంక్షన్‌హాల్లో చిదంబర శాస్త్రిని మంగళవారం సత్కరించారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో ముఖ్య భూమిక వహించగలగడం రామానుగ్రహమే అన్నారు. మానవుడిగా పుట్టి దైవత్వాన్ని నిరూపించిన రాముడిది పరిపూర్ణ అవతారమన్నారు. రాముడిని మనసులో ఊహించుకుంటే ఎన్నో మంచి లక్షణాలు అలవడతాయన్నారు. వాత్సల్య భారతి గౌరవ అధ్యక్షుడు ఎంవీ కుమార స్వామి దేశభక్తి, దైవభక్తి, మాతృభక్తిపై పాఠశాల కేంద్రంగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. వీహెచ్‌పీ జాతీయ న్యాయసలహా విభాగ సభ్యులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మాట్లాడుతూ దశాబ్దాలుగా అయోధ్య రామమందిర నిర్మాణానికి హిందూ సమాజం చేసిన కృషిని వివరించారు. ప్రొఫెసర్ జీఎస్ మూర్తి, వాత్సల్య భారతి గౌరవాధ్యక్షులు కుమారస్వామి, ఉపాధ్యక్షులు మద్దాలి శ్రీనివాసరావు, కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అన్నదానం చిదంబర శాస్త్రిని సన్మానించారు.

నేడు వేంకటేశ్వరుని కల్యాణం

కొత్తపల్లి: కొండెవరంలో ఉన్న పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ధ్వజారోహణ, రాత్రి స్వామివారి కల్యాణం ఉంటుందన్నారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా బాలబాలికలకు ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు 21 నుంచి 24వ తేదీ వరకూ జరుగుతాయి.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



కమలాకరరావును జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న సరస్వతీ గాన సభ సభ్యులు



గాత్ర కచేరీ చేస్తున్న రమ్య కిరణ్మయి

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యకళా మందిరంలో చెన్నైకి చెందిన చాగంటి రమ్య కిరణ్మయి గాత్ర కచేరీ ఆహ్లాదంగా సాగింది. వరాళి రాగంలో మామవ మీనాక్షి, బిలహరి రాగంలో ఎవరిని వేడను, మైసూర్ వాసుదేవాచారి ధన్యాసి రాగంలో నీ చిత్తము మొదలైన కీర్తనలు చక్కగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. వీరికి వయొలిన్‌పై మంథా రమ్య, మృదంగంపై కె.సద్గురు చరణ్, చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత మృదంగ విద్వాంసులు వి.కమలాకరరావుకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మిరెడ్డి రామనరసింగరావు, పెద్దాడ సూర్యకుమారి, కేవీఎస్ ఆంజనేయమూర్తి, పేపకాయల రామకృష్ణ, చెరుకువాడ సత్యనారాయణ, చావలి సూర్యకుమారి, గోపి పళ్లంరాజు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు



వరుపుల సుబ్బారావుతో కలిసి బుక్‌లెట్లను చూపుతున్న కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్

శంఖవరం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మంగళవారం వజ్రకూటం గ్రామంలో కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎంపీపీ పర్వత రాజుబాబు, స్థానిక నేతలతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో ప్రజలకు మభ్యపెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్ సకురు గుర్రాజు, పార్టీ నాయకులు సకురు విష్ణు, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, వెలుగుల రాంబాబు, దూడల శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకుని రామాలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం విశేష సుదర్శన హోమం నిర్వహించారు. మంగళవారం ఉదయం సీతమ్మ, రాములోరిని అలంకరించిన వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణం చేశారు. అనంతరం శ్రీపుష్ప యాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీవారి పుష్కరిణి వార్షిక పూజలు



ఎస్.అన్నవరంలో శ్రీవారి పుష్కరిణి వార్షిక పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పుష్కరిణి తొలి వార్షిక పూజలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పుష్కరిణి (కోనేరు)లో దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారికి పంచహారతుల సేవ విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.